క్లుప్తంగా

పంటల వివరాలు తెలియజేయాలి

గరుగుబిల్లి: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి శనివారం కోరారు. రబీ సీజన్‌లో నువ్వులు, పెసర, మినుము, మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉందని, ఆయా పంటలు పండిస్తున్న వారంతా ఆధార్ కార్డు, 1–బి నకళ్లను ఆర్బీకే సిబ్బందికి ఇవ్వాలన్నారు. ఇలా చేయడం ద్వారా ఎక్కడ ఏ పంట ఎంతమేర సాగు అవుతుందో తెలియడంతో పాటు ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయడం, రైతులు తమ పంటలను అమ్మడం తేలికవుతుందన్నారు.

గణిత ప్రతిభా పోటీల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ కృష్ణమూర్తి

వీరఘట్టం: రాష్ట్ర స్థాయిలో అమెజాన్ సంస్థ నిర్వహించిన గణిత ప్రతిభా పోటీల్లో మండలంలోని కత్తులకవిటి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ మేరకు తొమ్మిదో తరగతికి చెందిన భూమిక, రోషిణి, భార్గవిలకు ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి చేతులమీదుగా శనివారం రూ.2 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ ఎస్.వి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

10 నుంచి ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం గ్రామంతో పాటు మధుర గ్రామాలైన ఖడ్గవలస, పిట్టలమెట్ట గ్రామాల్లో ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజు అమ్మవారి అనుపోత్సవం చేపడతామన్నారు.

ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ



గొల్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరాతీస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి యోగేశ్వరరెడ్డి

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, చిన్నారులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు శనివారం పంపిణీ చేశారు. అంతకుముందు పార్వతీపురం మన్యం జిల్లా మాస్ మీడియా అధికారి యోగేశ్వరరెడ్డి కేంద్రాల్లోని రికార్డులు, పౌష్టికాహార నిల్వలు పరిశీలించారు. క్రమం తప్పకుండా కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన



గడిగుడ్డిలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

సీతంపేట: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని గడిగుడ్డి, కొండపేట, కిరప గ్రామాల్లోని పొలాలు, చెరువు గట్ల వద్ద ఏర్పాటు చేస్తున్న హద్దురాళ్లను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. హద్దురాళ్ల ఏర్పాటు రైతుల సమక్షంలో చేయాలని సిబ్బందికి సబ్‌కలెక్టర్ సూచించారు. పక్కాగా భూముల రీసర్వే చేపట్టాలని, వీలైనంత త్వరగా సర్వే పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొదమకు రేషన్ సరుకులు తరలించండి

సాలూరు: గిరిశిఖర కొదమ పంచాయతీ గిరిజనులకు రేషన్ సరుకులు తరలించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. దీనికి సంబంధించి పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడారు. కొదమకు రేషన్ సరుకులు తరలింపులో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేయని అధికారుల వల్ల ప్రయోజనం లేదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందంటూ మండిపడ్డారు. ఇప్పుడున్న కాంట్రాక్టర్ రేషన్ సరుకులు కొదమకు సరఫరా చేయలేకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. సరుకుల పంపిణీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తోనే.. అన్నివర్గాల సంక్షేమం

- జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు

కొమరాడ:

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు అన్నారు. జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంగారేగువలస గ్రామంలో శనివారం పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలతో అనేక ప్రజాసమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. పార్టీని నమ్ముకున్న ఎంతో మందికి రాజకీయంలో సముచిత స్థానం కల్పించారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి, గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు, సచివాల య సిబ్బంది, గృహసారథులు, సచివాలయ కన్వీన ర్లు తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ అనంతనాయుడు

జియ్యమ్మవలస: జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చినకుదమ గ్రామంలో మండల సచివాలయాల కన్వీనర్ పల్ల అనంతనాయుడు ఇంటింటికీ వెళ్లి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పనిచేయాలని కోరారు. అనంతరం కార్యక్రమ స్టిక్కర్లు ఇంటింటికీ అతికించారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ, గొడుగూడ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు తోయక మాధవరావు, బాలకృష్ణ, సర్పంచ్ తోయక సీతమ్మతో కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించారు. ఎక్కడెక్కడ ఏయే అభివృద్ధి పనులు జరుగుతున్నాయో, ఏయే సంక్షేమ పథకాల ద్వారా ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో తెలిపారు. అనంతరం ఇంటి గోడలపై కార్యక్రమ స్టికర్లు, వాల్‌పోస్టర్లు అతికించి, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

భామిని: మండలంలోని చిన్నదిమిలి, ఘనసర, పెద్దదిమిలి గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ కిట్లు శనివారం పంపిణీ చేశారు. మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, పార్టీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించాలని తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అగతముడి రఘు, కిల్లారి పల్గుణరావు, ఎరుకుమజ్జి పాపినాయుడు, కిల్లారి చంటి తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న పార్టీ మండల కన్వీనర్ జనార్దనరావు



గుమ్మలక్ష్మీపురం: గొడుగూడలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు



భామిని: చిన్నదిమిలిలో జగనన్నే మా భవిష్యత్ కిట్లు అందజేస్తున్న పార్టీ నాయకులు

'రన్ ఫర్ జీసస్'



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాస్టర్లు, మత విశ్వాసకులు

వీరఘట్టం: మండల కేంద్రంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ శనివారం నిర్వహించారు. ప్రపంచ శాంతికి పిలుపునిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ పి.విన్సకుమార్ ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి ఏ విధంగా దోహదం చేస్తున్నాయో వివరించారు. జీసస్ ఎప్పుడూ మన ఎదుటి వారి తప్పులను క్షమించి, వారిని మళ్లీ ప్రేమించాలని తెలిపారన్నారు. ప్రతిఒక్కరూ ఒకరినొకరిపై ప్రేమ, జాలి, దయ కలిగి ఉండాలని కోరారన్నారు. అనంతరం ఏసు శిలువ మరణం పొందడాన్ని గుడ్ ఫ్రైడేగా, ఆయన పునరుత్థానం (మళ్లీ జన్మించడం) ను ఈస్టర్‌గా జరుపుకుంటున్నామన్నారు. యువతీ యువకులంతా ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేందుకు ఇదొక మంచి కార్యక్రమని పేర్కొన్నారు.

శంకరంబాడి సుందరాచారికి ఘననివాళి



శంకరంబాడి సుందరాచారి చిత్రపటానికి పూలతో నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సింహాచలం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మా తెలుగుతల్లికి మల్లెపూదండ గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి 46వ వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సామల సింహాచలం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయం ఆలపించి, గేయం గొప్పతనం వివరించారు. ఇంతటి గొప్ప గేయాన్ని ప్రతిరోజూ పాఠశాలల్లో ఉదయం ప్రార్థనాగీతంగా ఆలపిస్తున్నామని తెలిపారు.

భారీ వాహనాలతో ట్రాఫిక్ అవస్థలు



భామిని: పసుకుడి ప్రాంత రోడ్డు మీదుగా వస్తున్న భారీ వాహనం

భామిని: మండల కేంద్రంలో భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అవస్థలు నిత్యం తలెత్తుతున్నాయి. విశాఖపట్నం పోర్ట్ నుంచి అధిక లోడుతో వస్తున్న భారీ వాహనాలు మండల కేంద్రం మీదుగా ఒడిశా అక్కడి నుంచి ఛత్తీస్‌గఢ్ వెళ్తున్నాయి. దీంతో శనివారం పసుకుడి వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో అటువైపుగా వచ్చే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల కొలది అలాగే రోడ్లపై ఉండిపోవాల్సి వచ్చిందని, తరచూ ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు ఇరుకుగా ఉండడంతోనే ఈ సమస్య వస్తోందని అంటున్నారు. అధికారులు స్పందించి, రోడ్డు విస్తరణ అయినా చేపట్టాలని, లేదంటే ఇటువైపుగా వచ్చే వాహనాలనైనా దారి మళ్లించాలని కోరుతున్నారు.

భూ తగాదాలు తలెత్తకుండా హద్దురాళ్ల ఏర్పాటు

పాలకొండ రూరల్: భూముల రీసర్వేలో భాగంగా రైతుల మధ్య భూ తగాదాలు తలెత్తకుండా హద్దురాళ్ల ఏర్పాటు జరుగుతోందని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని అర్థలి గ్రామంలో సర్వే పూర్తయిన ప్రాంతాల్లోని పొలాల్లో హద్దురాళ్ల ఏర్పాటుకు ఆమె శనివారం శ్రీకారం చుట్టారు. త్వరితగతిన హద్దురాళ్ల ఏర్పాటు పూర్తి చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.శివయ్య, నాగవంశం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయ కొట్టి, హద్దురాళ్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న ఎంపీపీ భాను



వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నీలకంఠం

సీతానగరం: మండలంలోని రోడ్డు ప్రమాదాలు నివారణకు వాహన చోదకులు సహకరించాలని ఎస్‌ఐ కె.నీలకంఠం అన్నారు. రోడ్డు ప్రమాదాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర రహదారిలో ఆర్వోబీ వద్ద వాహన చోదకులు, విద్యార్థులతో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వాహనాలను నడపడం, మొబైల్‌లో మాట్లాడటం, అనుభవం లేని, చిన్న పిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డేగా గుర్తించి వాహనాలు తనిఖీ చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర రహదారిలో ప్రమాదాలు నివారణకు, ప్రమాదాలకు కారణమైన వాహనాల్ని గుర్తించడానికి ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.

ముస్లింలకు అండగా ప్రభుత్వం



ఎమ్మెల్యే జోగారావును కలిసిన ముస్లిం సోదరులు

పార్వతీపురం టౌన్: ముస్లిం సోదరులకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం పార్వతీపురం మత పెద్దలు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అలజంగి జోగారావుని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ పర్వదినం సందర్భంగా తోఫా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా రంజాన్ తోఫా ఇస్తానని ఎమ్మెల్యే తెలిపారు. షాదీ ఖానా కూడా ఏర్పాటుకు పూర్తి చర్యలు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో షేక్‌సఫీ, మహ్మద్ జలాల్, ఫారుక్‌ఖాన్, ఇబ్రహీం, ఖరీమ్, ఖాజ్‌జానీ, బుజ్జి అబీబ్, మఖ్బూల్ తదితరులు ఉన్నారు.

శత్రుచర్ల పరామర్శ



రామారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పార్వతీపురం: గరుగుబిల్లి మండల పరిషత్ అధ్యక్షుడు ఉరిటి రామారావు, కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పార్వతీపురంలో శనివారం పరామర్శించారు. ఇటీవల రామారావు తల్లి అమ్మడమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మృతికి కారణాలు తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సీతానగరం: మండలంలోని ప్రముఖ రాజకీయ నాయకుడు సాలా హరిగోపాలరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు పలువురు ప్రముఖులు శనివారం పరామర్శించారు. హరిగోపాలరావు తల్లి నారాయణమ్మ(94) శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వీరు శనివారం హరిగోపాలరావు కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు

- గిరిజన సంఘాల నేతల డిమాండ్

జియ్యమ్మవలస: బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దని గిరిజన సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై కురుపాంలోని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని ఆమె నివాసంలో శనివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఆయా వర్గాలను ఎస్టీల్లో చేర్చడం ద్వారా ఎస్టీలకు జరిగే అన్యాయం వివరించారు. ఇప్పటికే విద్య, ఉద్యోగ రంగాల్లో బాగా వెనకబడిన ఎస్టీలు ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయం అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోయక జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస: కురుపాంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..



వీరఘట్టం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: గిరిజనుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దని కోరుతూ గిరిజన సంఘం నాయకులు మండలంలోని వండవ గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించే ప్రయత్నం చేయగా, ఆందోళనకారులను వండవ జంక్షన్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగినట్లు సమాచారం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, సీఐ మురళీధర్ తెలిపారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు చేస్తున్న ఆందోళనను పోలీసులు ఎమ్మెల్యేకు వివరించగా, ఆమె సానుకూలంగా స్పందించారు. గిరిజన సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. షెడ్యూల్ ఏరియాలోని గిరిజనులకు విద్య, ఉద్యోగావకాశాలు అలాగే కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. ఇదే మాట సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు. ఇది గమనించి, గిరిజన సంఘం నాయకులు సమన్వయం పాటించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి జగనన్న సర్కారు చేస్తున్న మంచిని గమనించాలన్నారు.



వీరఘట్టం: వండవ జంక్షన్‌లో గిరిజన సంఘం నేతలకు సర్దిచెబుతున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్

'ఫ్యామిలీ డాక్టర్'తో బహుళ ప్రయోజనాలు

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, చికిత్స అందించడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మరిపివలస, నిడగల్లు, నీలకంఠాపురం, పాపమ్మవలస, వెంకటాపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన సార్వత్రిక టీకాల కార్యక్రమాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిడగల్లులో మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన సమయానికే గ్రామాల్లో సిబ్బంది వేస్తున్నారని,, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు క్షేత్ర స్థాయిలో వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల వల్ల ఉపయోగాలు పిల్లల తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రధానంగా రద్దీగా ఉండే పార్వతీపురం – సాలూరు నియోజక వర్గాలను అనుసంధానం చేస్తూ ఒడిశాకు సాగే బీటీ రోడ్డు విస్తరణ పనులతో పాటు కాలువల పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. చినబోగిలి మీదుగా మక్కువ దుగ్గేరు మీదుగా ఒడిశాకు వెళ్లే రహదారి విస్తరణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు చినబోగిలి నుండి మక్కువ వరకూ మొదటి విడతగా జగనన్న ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేయగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు.

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగారావు సంతృప్తి వ్యక్తం చేస్తూ అనుకున్న సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.